## 245. వసంతభైరవి - రూపకం

నీ దయ రాదా ॥నీ॥

కాదనే వారెవరు కల్యాణ రామా ॥నీ॥

నను [1]బ్రోచేవాడని నాడే తెలియ
ఇన వంశ తిలక ఇంత తామసమా ॥నీ॥

అన్నిటి కధికారివని నేఁ బొగడి[2]తి
మన్నించితే నీదు మహిమకుఁ దక్కువా ॥నీ॥

రామ రామ రామ త్యాగరాజ హృత్సదన
నా మది తల్లడిల్లగ న్యాయమా వేగమే ॥నీ॥

ఆ బాల్యముగా, నా జన్మాంతర పుణ్య సంస్కారముచే నా రక్షకుడవు నీవే యని గుర్తించి నిన్నే కీర్తించుచున్నాను. అనగా, నీ నా యనుబంధము ఆ గర్భ

***



శ్రీమంతుడన్నట్లు ఆ జన్మ సిద్ధము. కావున కాదనే వా రెవ్వరూ లేరు. అయనను ఇంత ఆలస్యము చేయుచున్నావు. ఇంతటనైన నీ దయరాదా! యని జాలిగా ప్రార్థించుట నైజ భక్తికి లక్షణము. సర్వమునకు నీవే అధికారివని నే భావించితిని. అనగా ఏ పనుల యందునూ, నా యహంకారమునకు తావివ్వలేదు. నిన్నే పొగడుచున్నాను. నా చిత్తము తహ తహ లాడుచున్నది. రామ రామ రామ యని పునః పునః కీర్తించుటలో ఒక సహజమైన ఆర్తి, నైరాశ్యము గోచరించునట్లు పాడుకొని, ఇది నీకు న్యాయమా! యని వేడుకొన్నారు.

ఇందలి రాగ, స్వరవిన్యాసము జాలిని వ్యక్తీకరించును.